
ప్రసవ వేదన...!

మాతా శిశు మరణాలు జరగకుండా ఎక్కడికక్కడ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించి సురక్షిత ప్రసవాలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన (పీహెచ్‌సీ) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు జిల్లాలో ఆశించిన స్థాయిలో లేదు. ప్రసవాల కోసం వచ్చే గర్భిణులపై వైద్యులు ఏమాత్రం దృష్టిపెట్టడం లేదు. ఆసుపత్రికి వస్తే చాలు.. జిల్లా ఆసుపత్రులకు రెఫర్ చేయడమే పనిగా పెట్టుకున్నారు. తద్వారా మెజార్టీ పీహెచ్‌సీల్లో ప్రసవాలు లక్ష్యానికి చేరుకోలేకపోతున్నాయి. కొన్ని చోట్ల మరీ దారుణం. నెలలో ఒక ప్రసవం కూడా నమోదు కావడం లేదు. ఏది ఏమైనా జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీలలోని వైద్యుల పనితీరు.. ఆ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ ఆశయం అభాసుపాలు కావడంతో పాటు జిల్లాలోని బాధిత గర్భిణులకు తిప్పలు తప్పడం లేదు.



ఆత్మకూరు పరిధిలోని కొట్టాల చెరువు పీహెచ్‌సీ

- పీహెచ్‌సీల్లో ప్రసవాలు అంతంతే
- లక్ష్యానికి దూరంగా 80 శాతం ఆసుపత్రులు
- కొన్నింటిలో జీరో ప్రసవాలు
- 10 నెలలు.. 1,029 కాన్పులు
- రెఫర్‌తో సరిపెట్టుకుంటున్న కొందరు వైద్యులు
- దృష్టి సారించని ఉన్నతాధికారులు

నంద్యాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలవు. ఆయా ఆసుపత్రుల్లో 24 గంటలు వైద్యసేవలు అందించాల్సిందే. ఒక్కొక్క పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులతో పాటు 10 నుంచి 13మంది సిబ్బంది ఉంటారు. ప్రభుత్వం జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీలోను నెలకు ఐదు ప్రసవాలు చేయాలనే లక్ష్యం విధించింది. ఆ దిశగా జిల్లాలో ప్రతి పీహెచ్‌సీ వైద్యులు పనిచేయాలి. కానీ క్షేత్రస్థాయిలో ఆ దిశగా జిల్లాలోని చాలామంది వైద్యులు ఎక్కడా పనిచేయడం లేదు. కొన్నిచోట్ల వైద్యులు లేకుండానే.. నర్సులే ప్రసవాలు చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇదిలా ఉండగా రాత్రి వేళ వస్తే ఇక అంతే సంగతులు. వైద్య సిబ్బంది లేరంటూ వెనక్కు పంపేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


మోత్కూరు పీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ (ఫైల్)

గడిచిన పది నెలల్లో జరిగిన ప్రసవాలు

ఏప్రిల్	: 99
మే	: 104
జూన్	: 138
జూలై	: 130
ఆగస్టు	: 96
సెప్టెంబరు	: 99
అక్టోబరు	: 97
నవంబరు	: 81
డిసెంబరు	: 101
జనవరి (2025)	: 84
మొత్తం జరిగిన ప్రసవాలు	: 1029

నంద్యాల జిల్లాలో ఇలా..

జిల్లాలోని పీహెచ్‌సీల సంఖ్య	: 52
గత 10 నెలల్లో జరిగిన ప్రసవాలు సంఖ్య	: 1,029
టార్గెట్ మేరకు ప్రతి నెల జరగాల్సినవి	: 260
గత 10 నెలల్లో జరగాల్సిన ప్రసవాల టార్గెట్	: 2,600
పది నెలల్లో కనిపించిన వ్యత్యాసం	: 1,571
ఒక్క ప్రసవం కూడా చేయని పీహెచ్‌సీలు	: 05

లక్ష్యానికి దూరంగా 80 శాతం పీహెచ్‌సీలు

జిల్లాలోని 52 పీహెచ్‌సీల్లో 80 శాతం పీహెచ్‌సీల్లో ప్రసవాల పరంగా చేధించడం లేదని అధికార లెక్కలు చెప్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం.. జిల్లాలోని 52 పీహెచ్‌సీల్లో నెలకు.. 260 చొప్పున.. ఈ పది నెలల్లో అన్ని పీహెచ్‌సీల్లో కలిసి 2,600 ప్రసవాలు జరగాల్సి ఉంది. కానీ అధికార లెక్కల ప్రకారం కేవలం 1,029 ప్రసవాలు మాత్రమే జరిగాయి. అంటే ఈ పది నెలల వ్యవధిలోనే.. లక్ష్యంలో 1571 ప్రసవాలు తక్కువగా ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే వైద్యుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని పీహెచ్‌సీల్లో మరీ దారుణం. లక్ష్యం ప్రకారం జరగాల్సిన ఐదు ప్రసవాలు కూడా చేయకపోవడం గమనార్హం.

మిగతా 6వ పేజీలో

రీ సర్వే పకడ్బందీగా చేపట్టండి

కలెక్టర్ రాజకుమారి


రీ సర్వే జరుగుతున్న విధానాన్ని గురించి రైతులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎస్. కొత్తపల్లె గ్రామ పొలాల్లో జరుగుతున్న సర్వేను ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. సర్వేపై నోటీసులు ఇస్తున్నారా లేదా, రీ సర్వేతో పొలం విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయా? అని గ్రామానికి చెందిన నరసింహుడు, రవికుమార్, నాగరాజులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అనుకూల సమాయాల్లో సర్వే చేపట్టాలని సిబ్బందికి సూచించారు. సర్వే సమయంలో ప్రతి రైతు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గతంలో జరిగిన సర్వే సమస్యలను పరిష్కరించాలని తహసీల్దారు శ్రీనివాసులకు సూచించారు.

పచ్చదనాన్ని పాడుచేస్తున్న వారిపై కేసులు నమోదు చేయండి

బీటీ రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు నిప్పు పెట్టి కాల్చివేస్తున్న వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేయాలని కలెక్టర్ రాజకుమారి ఎంపీడీవోను ఆదేశించారు. శుక్రవారం కానాల, మాయలూరు గ్రామాల మధ్య కాలిపోతున్న మొక్కలను ఆమె గమనించారు. అనంతరం ఆమె ఉయ్యాలవాడలోని కలియుగ దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి వారసుల ఇంటికి వెళ్లి..బ్రిటీష్ కాలంలో విక్టోరియా మహారాణి ఆయనకు బహూకరించిన బంగారు పతకం చూసి ఆనందించారు. వెంగళరెడ్డి జీవితచరిత్రను అడిగి తెలుసుకున్నారు.

ఆగని అటవీశాఖ వసూళ్లు

- శ్రీశైలం వెళ్లే భక్తులకు జేబు చిల్లు
- కలెక్టర్ ఆదేశించినా నిర్లక్ష్యం
- అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

ఆత్మకూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అధికారుల వసూళ్లు తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నాయి. దీని మీద కలెక్టర్ తీవ్రంగా స్పందించినా అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి వెళ్లే నల్లమల అటవీ మార్గంలో అక్కడక్కడ అటవీశాఖ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి పర్యావరణ రుసుము వసూలు చేస్తోంది. భారీ వాహనాలకు రూ.130, చిన్న వాహనాలకు రూ.70 చొప్పున ఆర్టీసీ బస్సులను కూడా వదలకుండా వసూలు చేస్తున్నారు. శ్రీశైలంలో జరిగే బ్రహ్మోత్సవాలపై జనవరి 22వ తేదిన నంద్యాల కలెక్టర్ శ్రీశైలంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అటవీ చెక్‌పోస్టు వద్ద పర్యావరణ రుసుము మినహాయింపు ఉంటుందని ప్రకటించారు. ఈ నిర్ణయంపై హిందూ ధార్మిక సంఘాలు హర్షం చేశాయి. అయితే బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనప్పటికీ బైర్లూటి, కొర్రప్రోలు, దోర్నాల, శిఖరం తదితర అటవీ చెక్‌పోస్టుల వద్ద అటవీ అధికారులు దర్జాగా పర్యావరణ రుసుము వసూళ్లు చేస్తున్నారు. రుద్రకోడూరు క్షేత్రానికి వెళ్లే వాహనాల నుంచి కూడా రూ.300 వసూలు చేస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి వెళ్లింది. మహాశివరాత్రి వరకు మినహాయింపు ఇవ్వాలని ఆదేశించినా వసూళ్లను ఆపకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఇది మల్లన్న భక్తులకు ఆర్థిక భారం కావడంతో పాటు ట్రాఫిక్ జామ్ సమస్యకు కూడా దారితీసే అవకాశం ఉంది.



బైర్లూటి చెక్‌పోస్టు వద్ద పర్యావరణ రుసుము వసూళ్లు చేస్తున్న దృశ్యం



హంస వాహనంపై భ్రామరితో ముక్కంటి

- వైభవంగా సాగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు
- భక్తులతో కిక్కిరిసిన శ్రీశైలం
- నేడు టీటీడీ, కాణిపాకం నుంచి పట్టువస్త్రాలు

శ్రీశైలం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వేలాది గొంతుకల శివనామస్మరణ.. వేదమంత్రాల నడుమ.. శివపరివారం వెంటరాగా శ్రీశైల మల్లికార్జునుడు భ్రమరాంబ అమ్మవారితో హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కిక్కిరిసన భక్తజన సందోహం నడుమ సాంస్కృతిక నృత్యాలు సాగుతుండగా స్వామివారి వాహనసేవ కన్నులపండువగా సాగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేక అలంకృతులైన స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో అలంకరించి హంసవాహనంపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాధికాలు, హారతులు సమర్పించి, అనంతరం మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ క్షేత్రపురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవం ముందు కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, జానపద పగటి వేషాలు, గొరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, తప్పెట్లు, డ్రమ్స్, భజంత్రీలు, భంజారా నృత్యం, చెంచునృత్యం, శంఖునాదాలు మార్మోగాయి.

నేడు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ఉదయం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం, రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

నేడు మయూరవాహన సేవ : శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నాలుగో రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి మయూరవాహనసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు.


హంస వాహనంపై స్వామి అమ్మవార్లు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమాలను ఆలయ దక్షణ మాడవీధిలోని నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీకళావేదిక, శివదీక్షాశిబిరాల ప్రాంగణంలో నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం సంప్రదాయ కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శన, జానపద నాటకం తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


నృత్యం చేస్తున్న మహిళలు


కళాకారుల ప్రదర్శన


నృత్యం చేస్తున్న కళాకారులు

సర్వ పాపాల నుంచి విముక్తిని ప్రసాదించే పరమశివుడే బందీ అయ్యాడు. ఎలాంటి పూజలు, కైంకర్యాలు లేకుండా ఏకంగా రెండేళ్లుగా ఓ ఇనుప షెడ్డులో ఉంటున్నాడు. నంద్యాల జిల్లా కేంద్రానికి సమీపంలోని అయ్యలూరు శివాలయంలో స్వామివారు పూజలకు నోచుకోవడం లేదు. దేవాలయాల జీర్ణోద్ధరణ నిర్లక్ష్యం చేయడమే కాకుండా దేవుడి సొమ్మును తమ వ్యక్తిగత విలాసాలకు వాడుకోవడంతోనే ఆలయ పునరుద్ధరణ ఆగి స్వామి పూజలు నిలిచిపోయినట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది.





శివలింగాన్ని ఉంచిన రేకుల షెడ్డు ఇదే...

శివయ్యకే శిక్ష...!

- రెండేళ్లుగా రేకుల షెడ్డులో శివలింగం
- అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ వైఫల్యం
- ఎక్కడికక్కడే ఆగిన పునరుద్ధరణ పనులు
- ఎటూతెగని అయ్యలూరు ఆలయ వివాదం

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అయ్యలూరు గ్రామంలో శివుడిని రెండేళ్లుగా చిన్న రేకుల షెడ్డులో ఉంచి తాళాలు వేశారు. జీర్ణోద్ధరణలో భాగంగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం శివాలయ పునర్నిర్మాణం ప్రారంభమైంది. నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్ పోతినేని ప్రసాదు ఈ ఆలయ నిర్మాణానికి రూ.72.16 లక్షలకు కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. సుమారు రూ.14.40 లక్షలు మేర ఖర్చు చేసి మిగిలిన పనులను నిర్లక్ష్యంగా వదిలేశాడు. ఇందుకు సంబంధించి బిల్లు కూడా మంజూరైంది. రెండు సంవత్సరాలైనా గుడి నిర్మాణం ముందుకు సాగకపోవటంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం.. నిలువెత్తు స్వార్థం పరమ శివుడి పాలిట శిక్షలా మారింది. అప్పటి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి సైతం గుడి నిర్మాణం గురించి పట్టించుకోకపోవటంతో శివలింగాన్ని నిర్మాణం జరుగుతున్న ఆవరణలో రేకుల షెడ్డులో ఉంచారు. అప్పటి నుంచి పూజలకు శివుడు దూరంగా ఉన్నాడు.

వర్గ విభేదాలతో కోర్టుకెక్కారు

గ్రామంలోని రెండు వర్గాలకు పొసగడం లేదు. ఓ వర్గం శివలింగం ఎత్తు పెంచాలని, మరో వర్గం శివలింగాన్ని కదిలించకుండా నిర్మాణ పనులు చేపట్టాలని కోర్టుకెక్కారు. కోర్టు యథావిధిగా నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించింది. గ్రామంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో నిర్మాణాన్ని ముందుకు సాగించలేక పోయాను.

- పోతినేని ప్రసాద్, కాంట్రాక్టర్

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం

దేవాలయ పునరుద్ధరణ అంచనాలను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ దృష్టికి తీసుకెళ్లాం. అప్పట్లో గర్భగుడి, అర్ధమండపానికి మాత్రమే అంచనా వేశాం. మంత్రి ఆదేశాల మేరకు ముఖమండపం, ఫ్లోరింగ్, ధ్వజస్తంభం, ప్రహరీ, విమానగోపురానికి అదనంగా రూ.2 కోట్లతో రివైజ్డ్ ఎస్టిమేషన్ వేశాం. కాంట్రాక్టర్ వచ్చి నిర్మాణ పనులు చేపడతారు.

- శ్రీనివాస ప్రసాద్, డీఈ



ఆదిలోనే ఆగిన శివాలయ నిర్మాణం

కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశాం

కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీచేశాం. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే శివాలయ నిర్మాణం ఆదిలోనే ఆగిపోయింది. కాంట్రాక్టర్‌కు మరోసారి నోటీసులు అందజేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఆలయ పునరుద్ధరణకు వేగవంతంగా చర్యలు తీసుకుంటాం.

- వేణునాథ రెడ్డి, ఈఓ

శివయ్యకు పూజలు జరగాలి

వీలైనంత త్వరగా శివాలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలి. నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల శివుడు బందిఖానాలో ఉంటూ పూజలకు నోచుకోవడం లేదు. నిర్మాణం పూర్తిచేసి శివలింగ ప్రతిష్ఠ చేస్తే గ్రామానికి మేలు జరుగుతుంది. శివాలయ నిర్మాణ పనులు ఆగి పోవడానికి అధికారులు నిర్లక్షమే ప్రధాన కారణం.

- శంకరమ్మ, గ్రామస్థురాలు



ఎంపీడీవో, ఏపీవోలకు షోకాజ్ నోటీసులు

- ప్రజలు వలసలు వెళ్లకుండా పనులు కల్పించండి
- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం రోజువారి, వారపు లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యంగా ఉన్న పెద్దకడుబూరు, ఎంపీడీవో, కౌతాళం, ఏపీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా డ్వామా పీడీని ఆదేశించారు. శుక్రవారం ఉపాధి హామీ పథకం అమలు, హౌసింగ్ అంశాలపై ఏపీడీలు, ఎంపీడీవోలు, ఏపీవోలు, హౌసింగ్ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించకపోవడం వల్లనే ప్రజలు వలసలు వెళితే ఎంపీడీవో, ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల మీద చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల పర్యటన వివరాలతో టూర్ డైరీలను కూడా సమర్పించాలని ఆదేశించారు. ఉపాధి పనులు కల్పించడంలో సి. బెళగల్, వెల్దుర్తి, పత్తికొండ, ఎమ్మిగనూరు, దేవనకొండ, ఆదోని, తుగ్గలి, పెద్దకడుబూరు, నందవరం, ఓర్వకల్లు, కౌతాళం, కోడుమూరు మండలాలు వెనుకబడ్డాయన్నారు. ఆదోని మండలం నుంచి ఫీల్డ్‌కు వెళ్లి పరిశీలించి నివేదిక ఇవ్వాలని డ్వామా పీడీని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు, కులం సర్టిఫికెట్లు జారీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రూరల్‌లో 3 సెంట్లు, అర్బన్‌లో 2 సెంట్లు స్థలం మంజూరు చేయమని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. హౌస్ సైట్స్ రివెరిఫికేషన్, లబ్ధిదారుల గుర్తింపుపై తగిన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, హౌసింగ్ పీడీ అజయ్ కుమార్, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

కొండెక్కిన కొబ్బెర

- రిటైల్ మార్కెట్లో కేజీ రూ.200
- టెంకాయ రూ. 35
- కుంభమేళా ఎఫెక్ట్ అంటున్న వ్యాపారులు



కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వంటింట్లో విరివిగా వాడే కొబ్బెర ధర గత కొద్ది రోజులుగా భారీగా పెరిగింది. రిటైల్ మార్కెట్లో కేజీ కొబ్బెర ధర రూ.200కు చేరుకుంది. కొబ్బెర ఇంత ధర గతంలో ఎన్నడూ లేదని వ్యాపారులు సైతం పేర్కొంటున్నారు. రూ.90 నుండి రూ.100, 120 వరకు ఉన్న కొబ్బెర అతి తక్కువ కాలంలో ఇంత పెరగడంతో కొనలేని పరిస్థితి నెలకొంది. దేశంలో కొబ్బెర దిగుబడులు తగ్గి పోవడమే దీనికి ప్రధాన కారణమని పలువురు పేర్కొంటున్నారు. నిన్న మొన్నటి వరకు రూ.15, 20లోపు ఉన్న టెంకాయ ధర ఏకంగా రూ.30 నుండి రూ.40వరకు చేరుకుంది. మన రాష్ట్రంలో కోస్తాలో విస్తారంగా లభించే కొబ్బరి కాయలు కుంభమేళాకు తరలుతున్నందు వల్ల కూడా ధరలు పెరిగాయి. దీంతో కొందరు వ్యాపారులు కర్ణాటకలోని తుముకూరు, గౌరీబిదనూరు, పావగడ ప్రాంతాల నుండి టెంకాయలు దిగుమతి చేసుకుంటున్నట్లు వ్యాపారులు తెలిపారు.

శ్రీశైలంలో ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న ఈఓ ఎం. శ్రీనివాసరావు

శ్రీశైలం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఈఓ ఎం.శ్రీనివాసరావు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు, శివదీక్షా శిబిరాలు, పార్కింగ్ ప్రదేశాలు, 30 పడకల వైద్యశాలను తనిఖీ చేశారు. క్యూలైన్లో వేచివున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుడదని, నిరంతరం భక్తులకు అల్పాహారం, మంచినీటిని అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈఓ వెంట ఈఈ నరసింహారెడ్డి, ఏఈఓ హరిదాసు తదితరులు ఉన్నారు.

ప్రసవ వేదన..!

(5వ పేజీ తరువాయి)

రెఫర్‌తో సరిపెడుతున్న కొందరు వైద్యులు

నెల కాదు.. రెండు నెలలు కాదు.. ఏకంగా 10 నెలలు పాటు ఒక ప్రసవం కూడా చేయని పీహెచ్‌సీలు జిల్లాలో ఉండటం విమర్శలకు తావిస్తోంది. ఆశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సదరు పీహెచ్‌సీ వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విషయం ప్రసవాల గణాంకాలు చూస్తుంటే తెలుస్తోంది. జిల్లాలో చాలా వరకు వైద్యులు స్థానికంగా ఉండకపోవడం.. రాత్రి వేళలో అందుబాటులో లేకపోవడంతో ప్రసవాల లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వైద్యులు, వైద్యసిబ్బంది కుమ్మక్కై ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. మరికొందరు వైద్యులైతే పరిస్థితి విషమంగా ఉందంటూ (హైరిస్క్) జిల్లా ఆసుపత్రులకు రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. మొత్తంగా కొందరు వైద్యులు నిర్లక్ష్యం.. ఆశాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపంతో ప్రసవాల పరంగా లక్ష్యాన్ని చేధించలేకపోతున్నారని స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటికైనా ఆశాఖ ఉన్నతాధికారులు స్పందించి లక్ష్యం దిశగా ప్రసవాలు జరిగే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లక్ష్యం ప్రకారం చేసేలా చర్యలు

- డీఎంహెచ్ వెంకటరమణ



జిల్లాలో ప్రతి పీహెచ్‌సీలో లక్ష్యం మేరకు ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రసవాలు చేయని వైద్యులు తగిన అదేశాలు జారీ చేశాం. రాత్రి వేళల్లో కూడా అందుబాటులో ఉండాలి. అనవసరంగా రెఫర్ చేసినా.. ప్రవేట్ ఆసుపత్రులకు పంపించినా సంబంధిత వైద్యులు, వైద్య సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేసి ప్రసవాలు ఎక్కువగా జరిగే విధంగా చూస్తాం.

ప్రకృతి అందాల మధ్య ఉల్లెడకొండ మల్లేశుడు



ఉల్లెడకొండలో ప్రకృతి పందిరి

మహాశివరాత్రికి ఏర్పాట్లు

రుద్రవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రికి ఉల్లెడ కొండపై మల్లేశ్వరస్వామి సన్నిధిలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఆళ్లగడ్డ, అహోబిళం రహదారి నాగంబాయి నుంచి 18 కిమీ, నంద్యాల ఒంగోలు రహదారి పచ్చర్ల పైభాగం నుంచి 18కిమీ మధ్యలో ఉల్లెడ మల్లేశ్వరస్వామి వెలిశారు. మహాశివరాత్రికి భక్తులు వెళ్లేందుకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొండ గుహల మధ్య, ప్రకృతి పందిరి కింద వెలసిన స్వామివారిని సేవించేందుకు భక్తులు శివరాత్రి రోజున వెళతారు. అడవికి, వన్యప్రాణులకు హానీ తలపెట్టవద్దని, నిప్పు పెట్టవద్దని అధికారులు భక్తులకు సూచించారు.



ఉల్లెడకొండలో స్వయంభువుగా వెలసిన నాగపడిగ దృశ్యం



పార్వతీదేవి అమ్మవారు, ఉల్లెడ మల్లేశ్వరస్వామి

పారదర్శకంగా ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతులు


కర్నూలు డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతుల కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ వెల్లడించారు. ఈ మేరకు ఈ నెల 21న ఆంధ్రజ్యోతిలో 'ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతుల్లో గందరగోళం' అన్న వార్తకు డీఎంహెచ్‌వో వివరణ ఇచ్చారు. జిల్లాలోని 35 పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ల ద్వారా స్పష్టమైన తుది జాబితాను సిద్ధం చేసిన తర్వాత పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇంకా ఎక్కడైనా ఖాళీలు, అభ్యంతరాలు ఉంటే మెడికల్ ఆఫీసర్ ద్వారా సేకరించి ఏఎన్ఎంలకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. గ్రామ, వార్డు, సచివాలయ, హెల్త్ కార్యదర్శుల పదోన్నతుల కోసం ఈ నెల 17న ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతుల జాబితాను విడుదల చేశామన్నారు. రెండో ఏఎన్ఎం, ఈసీ ఏఎన్ఎం ఖాళీలకు పొజిషియన్ ఐడీ ఉండదని, జీతాలు రావడం ఆలస్యమవతుందన్న ఉద్దేశంగా వాటిని ఖాళీలుగా చూపించలేదని వివరించారు. పొజిషియన్ ఐడీ లేకుండా జీతాలు రావడం ఆలస్యమవుతుందని అందుకే నంద్యాల జిల్లాలో వీటిని సరి చేసుకుని జాబితా పంపించాలని డీఎంహెచ్‌వో కోరారు. లద్దగిరి పీహెచ్‌సీలోని అమడకుంట్ల, లద్దగిరి, గోనెగండ్ల పీహెచ్‌సీలో వెలుగోడు, గోనెగండ్ల, హెచ్.ఖైరవాడి, కల్లూరు పీహెచ్‌సీలో సల్కాపురం, షరీన్‌నగర్, నందవరం పీహెచ్‌సీలో ముగతి, నందవరం-1 కనకవీడు, ఇన్‌పొజిషియన్‌లో ఉన్నాయన్నారు. గోనెగండ్ల పీహెచ్‌సీలోని కులుమాల, కోసిగి పీహెచ్‌సీలోని కోసిగి-4, నందవరం పీహెచ్‌సీలోని నందవరం-2 యరోపియన్ ఏఎన్ఎం పోస్టులు, పోలకల్ పీహెచ్‌సీలోని గుడిపాడు, నాగులాపురం, జులేకర్, ఉలిందకొండ, పీహెచ్‌సీలోని బొమిరెడ్డిపల్లెలో రెండో ఏఎన్ఎం పోస్టులు ఉన్నాయనీ తెలిపారు.

ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ

- ప్రజల మద్దతుతో బ్రిటీష్ పాలకులపై తొలి తిరుగుబాటు
- నేడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధతి



ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భరతమాతను బ్రిటీషు పాలన నుండి విముక్తి చేయడానికి రాయలసీమలో గర్జించిన తొలి స్వాతంత్ర సమరయోధుడు రేనాటి పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. ఆయన 1847 ఫిబ్రవరి 22న కోవెల కుంట్లలోని ట్రెజరీ సమీపంలో ఉన్న జుర్రేటి వాగు వద్ద బ్రిటీషు వారు ఉరి తీసి ఉరి కొయ్యకు వేలాడదీశారు. నేడు నరసింహారెడ్డి 178వ వర్ధంతి.

నరసింహారెడ్డి వీర గాథ

1846లో నరసింహారెడ్డికి రావలసిన నెల వారి భరణం కోసం తన అనుచరుడ్ని కోవెలకుంట్లలోని తహసీల్దారు కార్యాలయానికి పంపించారు. అయితే అక్కడి బ్రిటీషు తహసీల్దారు భరణం ఇవ్వకుండా నరసింహారెడ్డి అనుచరుడ్ని అవమానించి పంపించాడు. అయితే పన్నుల పేరుతో బ్రిటీషు వారు ప్రజలను హింసిస్తుండటం సహించలేని నరసింహారెడ్డి అప్పటికే బ్రిటీషు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. తనకు రావలసిన భరణం ఇవ్వకపోవడంతో నరసింహారెడ్డికి ఆగ్రహం వచ్చింది. 1846 జూలై 10న తహసీల్దారును చంపుతున్నట్లు తన దత్తత గ్రామాల్లో చాటింపు వేయించారు. తాను అనుకున్న సమయానికి నరసింహారెడ్డి ప్రజలు చూస్తుండగా కోవెలకుంట్ల తహసీల్దారును నరికి వేసి ట్రెజరీలోని ఖజానాను కొల్లగొట్టి ఆ ప్రాంత ప్రజలకు పంచి పెట్టారు. ఈ విధంగా నరసింహారెడ్డి బ్రిటీషు వారిపై తన తొలితిరుగుబాటును ప్రారంభించారు. అనంతరం బ్రిటీషు వారు నొస్సం గ్రామంలో ఉన్న ఆయన కోటపై దండయాత్ర చేసి కోటను ధ్వంసం చేశారు. నేటికి ఆ కోట గోడలు అలానే ఉన్నాయి. నరసింహారెడ్డి అక్కడి నుంచి అహోబిలానికి వెళ్లి పాలెగాళ్లను అందరినీ ఏకం చేసి దేశం నుంచి బ్రిటీషు వారిని తరిమి వేయాలని సంకల్పించారు. నరసింహారెడ్డిపై ఆగ్రహంతో ఉన్న అప్పటి కడప కలెక్టర్ కాంక్రైన్ తన అనుచరుల్లో ఒకరికి ధనం ఆశచూపి లోబరుచుకున్నాడు. 1847 ఫిబ్రవరి 22న నరసింహారెడ్డిని గిద్దలూరు ప్రాంతంలోని జగన్నాథ గట్టుపై బ్రిటీ సైన్యం చుట్టుముట్టి పట్టుకుంది. కోవెలకుంట్లలోని జుర్రెట్టి వాగు వద్ద ప్రజలు సమక్షంలో బహిరంగంగా ఉరి తీశారు. ప్రజలను భయాందోళనలకు గురి చేయాలని అతని తలను 30 ఏళ్ల పాటు ఊరి వాకిలికి వేలాడ దీశారు.

నరసింహారెడ్డి జీవిత చరిత్ర

నరసింహా రెడ్డి 1806 నవంబరు 24న పెద్దమల్లారెడ్డి, నీలమ్మల దంపతులకు రూపనగుడి గ్రామంలో జన్మించారు. ఉయ్యాలవాడలో పెరిగారు. సమీపంలోని గుళ్లదుర్తి గ్రామంలో విద్యాభ్యాసం చేశారు. అప్పటి నొస్సం జమీందారు చెంచు మల్లారెడ్డి మనవడు నరసింహారెడ్డి. చెంచు మల్లారెడ్డికి కుమారులు లేనందున వారసత్వం దృష్ట్యా తన కుమార్తె కొడుకు(మనవడు) అయిన నరసింహారెడ్డిని తన 22వ ఏట దత్తత తీసుకొని తన అధికారం కింద ఉన్న కర్నూలు, కడప, అనంతపురం, బళ్లారి ప్రాంతాలకు పాలెగాడిగా పట్టాభిషేకం చేస్తారు. అప్పటి నుంచి నరసింహారెడ్డి దాదాపుగా 70 గ్రామాలకు పాలెగాడిగా ఉండేవారు. 1842లో అప్పటి బ్రిటీషు ప్రభుత్వం పాలెగాళ్ల వ్యవస్థను రద్దుచేసి నరసింహారెడ్డి దత్తత గ్రామాలను స్వాధీనం చేసుకొని చెంచు మల్లారెడ్డికి ప్రతి నెల రూ. 11 భరణం ఇచ్చింది. చెంచు మల్లారెడ్డి మరణం అనంతరం వంశ పారపర్యంగా బ్రిటీషు వారు ఇచ్చే నెల వారి భరణం నరసింహారెడ్డికి రావలసి ఉంది. ఇలా బ్రిటీషు వారు పాలగాళ్ల వ్యవస్థను రద్దు చేసి దత్తత గ్రామాలను స్వాధీనం చేసుకొని ఆ ప్రాంత ప్రజలను పన్నుల పేరుతో హింసిస్తూ ఇబ్బందులు పెట్టవారు.



కోర్టు భవనాలు త్వరగా నిర్మించండి



న్యాయవాదులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

జిల్లా న్యాయాధికారి కబర్థి

ఆదోని రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కోర్టు భవనాలను త్వరగా నిర్మించాలని జిల్లా న్యాయాధికారి కబర్థి అన్నారు. శుక్రవారం ఆదోనికి వచ్చిన కపర్థి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మొలగవల్లి జనార్దన్, జనరల్ సెక్రటరీ సురేంద్ర పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న కోర్టు భవనాలను ఆయన పరిశీలించారు. వేగవంతంగా, నాణ్యతతో సకాలంలో భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా జడ్జి వెంట సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి పి.జె. సుధా, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి లీలా సుభాష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అర్చన, న్యాయవాదులు పాల్గొన్నారు.

కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

- రాయలసీమ సాగునీటి సమితి డిమాండ్



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్‌లో మహాత్ముడి విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్డును విజయవాడలో ఏర్పాటు చేస్తే సహించేది లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ప్రకటనపై ప్రజా, రైతుసంఘాలు భగ్గు మంటున్నాయన్నారు. ప్రశ్నించాల్సి ప్రతిపక్షం కేసులకు భయపడి నోరు మెదపడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో విజయవాడ వేదికలో కర్నూలులోనే బోర్డును ఏర్పాటు చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. నీటి హక్కుల విషయంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల రాయలసీమ తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యకం చేశారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో నిల్వ ఉంచాల్సిన 1,200 టీఎంసీలు దిగువకు వదిలిపెడుతూ రాయలసీమ రైతుల గొంతు కోశారని తీవ్రంగా విమర్శించారు. విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని తరలిస్తున్న తెలంగాణ ప్రభుత్వ చర్యలను అడ్డుకోవాల్సిన అధికార, ప్రతిపక్ష పార్టీలు పట్టించుకోలేదన్నారు. కేడీసీసీ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి, మిల్క్‌డెయిరీ డైరెక్టర్ బాలీశ్వరరెడ్డి, ఆకుమళ్ల రహీం, నిమ్మకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల బస్సు బోల్తా

- కుంభమేళాకు వెళ్లి తిరిగి అనంతపురం వెళ్తుండగా ప్రమాదం



క్షతగాత్రులను బయటకు తీస్తున్న గ్రామస్థులు

తుగ్గలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో మరో మూడు గంటల్లో గమ్యానికి చేరే సమయంలో భక్తుల బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, 12 మంది స్వల్పంగా గాయపడ్డారు. శుక్రవారం మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని స్వగ్రామాలకు బయలేదురారు. అయితే జొన్నగిరి-మదనంతపురం క్రాస్ మధ్య మలుపు వద్ద బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. అనంపురం జిల్లా నుంచి 43 మంది భక్తులు ఈ నెల 6వ తేదీన కుంభమేళాకు తీసుకెళ్లారు. తీర్థయాత్రలు చేసుకుని మరో మూడు గంటల్లో గమ్యస్థానాలకు చేరే సమయంలో ప్రమాదం జరిగింది. బస్సు బోల్తా పడటంతో ప్రయాణికులు అందరూ ఇరుక్కుపోవడంతో జొన్నగిరి గ్రామస్థులు, టీడీపీ నాయకులు, పోలీసులు క్షతగాత్రులను బస్సులో నుంచి బయటకు తీసి గాయపడిన వారిని గుత్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారిలో తులసి, పూర్ణిమ, డ్రైవర్ వినోద్ పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం వైద్యశాలకు తరలించారు. పుష్పావతి, లక్ష్మయ్య, మహాలక్ష్మి, రమేష్ నాయక్, ప్రమీళ, ఉమాదేవి, స్కంద, వెంకటరమణప్ప, నాగరాజులకు స్వల్పగాయాలు కావడంతో గుత్తి వైద్యశాలలో చికిత్సలు అందించారు. క్షతగాత్రుల్లో బెంగళూరు, భాగేపల్లి, దొడ్డబల్లాపూర్, అనంతపురం, గౌరిబిందనూరు తదితర గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. పత్తికొండ ఆర్డీవో డా.భరత్ కుమార్ నాయక్, పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్‌గౌడు, తహసీల్దార్ రమాదేవి, జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్ సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను వైద్యశాలకు తరలించి మిగిలిన వారిని ప్రత్యేక వాహనాల్లో వారి సొంత గ్రామాలకు తరలించారు. జియో మైసూరు కంపెనీ వారు క్రేన్ పంపించడంతో బస్సును పక్కకు తొలగించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో నిందితుడి అరెస్టు

ఆదోని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సంచలనం రేపిన రూ.కోట్ల విలువ చేసే భూమి అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో ప్రధాన నింధితుడు చాకలి ఈరన్నను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సూర్య మోహన్ రావు వివరాలు వెల్లడించారు. మండిగిరి పంచాయతీ పరిధిలోని యగ్గటి ఈశ్వరప్పకు చెందిన సర్వే నెం. 321/ఏలోని 6.51 ఎకరాల పొలాన్ని నంద్యాలకు చెందిన ఆముదాల భాస్కర్ తాను ఈశ్వరప్ప కొడుకు అని నకిలీ డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించి 2024 డిసెంబర్ 31న రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విషయం తెలుసుకున్న అసలైన యజమాని ఈశ్వరప్ప జనవరి 4న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మోసంలో 10మందికి పైగా కేసు నమోదు చేశారు. ఇప్పటికే 8 మందిని అరెస్టు చేయగా, ప్రధాన నింధితుడు గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికిచెందిన చాకలి ఈరన్న పరారీలో ఉన్నారు. శుక్రవారం ఆస్పరి బైపాస్ వద్ద ఉన్నట్లు సమాచారం మేరకు అదుపులోకి తీసుకునానరు. నిందితుడి నుంచి నకిలీ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ హాజీమియ్యా ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు.



నిందితుడిని చూపుతున్న సీఐ

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సస్పెన్షన్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి టి.నరసింహులును సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. 8వ డివిజన్‌లో పని చేస్తున్న ఉద్యోగి 8వ వార్డులో పుష్‌గాట్స్‌ను గుజురి దుకాణంలో అమ్మివేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయనను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నరసింహులుతో పాటు అనధికార వ్యక్తి కూడ ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.

టమోటా రైతులను ఆదుకుంటాం

- గిట్టుబాటు ధర అందిస్తామన్న జాయింట్ కలెక్టర్ నవ్య
- పత్తికొండ మార్కెట్ యార్డులో కొనుగోళ్లు తిరిగి ప్రారంభం



పత్తికొండ మార్కెట్‌యార్డ్‌లో రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

పత్తికొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటామని జాయింట్ కలెక్టర్ నవ్య అన్నారు. శుక్రవారం ట్రైనీ కలెక్టర్ కళ్యాణితో కలసి పత్తికొండ మార్కెట్ యార్డులో టమోటా విక్రయాలను పరిశీలించారు. అంనతరం విలేకర్లతో మాట్లాడు తూ జిల్లా వ్యాప్తంగా టమోటా దిగుబడులు వస్తున్నాయని, అయితే మార్కెట్ యార్డులలో కొనుగోలు కేంద్రాలు నిలిచిపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరకు పంటను అమ్ముకుని నష్టపోతున్నరన్నారు. దీనికి తోడు ఇతర రాష్ట్రాల నుండి నాణ్యత ఎక్కువ ఉన్న టమోటా దిగుబ డులు పెరగడంతో సాధారణ నాణ్యత కలిగిన స్థానిక పంటను కొనుగోలు చేయడానికి వ్యాపా రులు ఆసక్తి చూపడం లేదన్నారు. దీంతో టమోటా రైతు లకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభు త్వం సిద్ధమైందన్నారు. నో లాస్ నో ప్రాఫిట్ కింద జిల్లావ్యాప్తంగా ఉన్న మార్కెట్ యార్డ్‌ల ద్వారా టమోటాను మార్కెటింగ్ శాఖ కొని రైతుబజార్లకు తరలిస్తుందన్నారు. కొనుగోలు చేసిన పంటకు మార్కెటింగ్ శాఖ వెంటనే సొమ్ము చెల్లిస్తుందని తెలిపారు. పత్తకొండ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం 2 టన్నుల మేర టమోటా పంటను కొన్నామని అన్నారు. రైతుకు కిలో రూ10 గిట్టుబాటు ధరను అందిస్తున్నామని అన్నారు. నాణ్యత తగ్గితే గిట్టుబాటు ధర తగ్గుతుందని అన్నారు. శనివారం నుంచి పత్తికొండ మార్కెట్ యార్డ్‌లో పూర్తిస్థాయిలో టమోటా కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని అన్నారు. మార్కెటింగ్ ఏడీఎం నారాయణమూర్తి, ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటేశు, హార్టీకల్చర్ ఏడీ దస్తగిరి, మార్కెట్ సెక్రటరీ కార్నలీస్ ఉన్నారు.

కిలో రూ.10లకి కొన్నారు



బోరు కింద ఎకరాలో టమోటా సాగు చేశా. పత్తికొండ మార్కెట్ బంద్ కావడంతో వ్యాపారులకు పంట అమ్ముకుంటు న్నాను. కిలో రూ.5లరే మించి వ్యాపారులు కొనలేదు. ఈరోజు 24 బాక్స్‌లు తీసుకురాగా కిలో రూ.10ల చొప్పున మార్కెటింగ్ అధికారులు కొని వెంటనే డబ్బులు ఇచ్చారు. **- లక్ష్మన్న, పెరవలి**

భక్తులకు మెరుగైన సౌకర్యాలు



అన్నదానసత్రంలో భోజనం చేస్తున్న మల్లెల రాజశేఖర్

- టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్
- కాల్వబుగ్గలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ఓర్వకల్లు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ వెల్లడించారు. ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ కాల్వబుగ్గ క్షేత్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. రెండు కోనేరులను బోరు నీటితో నింపామన్నారు. అలాగే మహిళల కోసం ప్రత్యేకంగా స్నానపు ఘట్టాలు ఏర్పాటు చేశామన్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా క్యూలైన్లు ఎండలను దృష్టిలో పెట్టుకుని ఆలయ ప్రాంగణంతో టెంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో మద్దిలేటి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, భక్తులు కేవీ మధు, సుధాకర్, రాము, ఆలమ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారా యణ శర్మ, కల్లె లక్ష్మీనర సింహశర్మ, బజారు, గువ్వ రవికుమార్, వేణు, గొల్ల నాగరాజు, మాజీ ఎంపీటీసీ నాగరాజు ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్

కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లను దేవదాయ ఉప కమిషనర్ పట్టెం గురుప్రసాద్ పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను, పెద్ద కోనేరు, చిన్నకోనేరు, అన్నదాన సత్రాన్ని పరిశీలించి అధికారులకు, ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అందరూ సమన్వయంతో పని చేసి భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఈఓ మద్దిలేటిని ఆదేశించారు.

కుంభమేళాకు వెళ్లి మంత్రాలయం వాసి మృతి

- నర్మదా నది వద్ద మృతదేహం.. అక్కడే అంత్యక్రియలు

మంత్రాలయం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు వెళ్లిన మంత్రాలయం వాసి శంకర స్వామి (52) మృతి చెందారు. బంధువులు, తోటి యాత్రికులు తెలిపిన వివరాలివీ.. ఈ నెల 12న పెద్దకడుబూరు మండలం బసలదొడ్డి గ్రామానికి చెందిన కొంత మంది, మంత్రాల యానికి చెందిన 8 మంది బస్సును అద్దెకు తీసుకుని కుంభమేళాకు బయలుదేరారు. తీర్థయాత్రలకు వెళ్లే మార్గాల్లో ఆయా పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ వెళ్లారు. ఈ నెల 16న ఓంకారేశ్వరంలోని నర్మద నది వద్ద ఉదయం కాలకృత్యాలను తీర్చుకునేం దుకు బస్సును నిలిపారు. కాలకృత్యాల కోసం వెళ్లిన శంకరస్వామి అదృశ్యమ య్యారు. బంధువులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి గాలింపు చేపట్టారు. నర్మదా నదిలో శవమై కనిపించినట్లు గురువారం పోలీసులు కనుగొని బంధువులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అక్కడే అంత్యక్రియలు చేశారు. శంకర్ స్వామి అవివాహితుడు.



శంకర్ స్వామి(ఫైల్)

బాలురు అదృశ్యం

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని పొన్నాపురం కాలనీకి చెందిన ఇద్దరు పిల్లలు తప్పిపో యినట్లు తాలుకా అర్బన్ సీఐ ఈశ్వరయ్య శుక్రవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన పొన్నాపురం కాలనీలోని వారి ఇళ్లనుంచి ఇద్దరు బాలురు మధ్యాహ్నం 3గంటలకు బయటకు వెళ్తున్నామని చెప్పి తిరిగి రాకపోవడంతో పిల్లల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని చెప్పారు. పొన్నాపురం కాలనీకి చెందిన కాకి సురేంద్ర కుమారుడు కాకి నరేష్ (12) అనే బాలుడు, షేక్ హరూన్ బాషా కుమారుడు షేక్ జహీర్ మౌలాలి (12) అనే ఇద్దరు బాలలు వారి వారి ఇళ్ల నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇళ్లకు చేరలేదని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి గాలిస్తున్నామని సీఐ తెలిపారు.



షేక్ జహీర్ మౌలాలి, కాకి నరేష్

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయిని

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయిని విద్యార్థి షేక్ మహమ్మద్ అజిజుల్లాను చితకబాదిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దీంతో ఆ విద్యార్థి తొడ ఎర్రగా కందిపోయింది. 2వ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ మహమ్మద్ అజిజుల్లా చదువులో వెనుకబడి ఉన్నాడని ఉపాధ్యాయిని కొట్టినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. డీఈవోకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. విద్యాశాఖధి కారులు విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫి డిమాండ్ చేశారు. పాఠశాలలో జరుగుతున్న సంఘటనపై అలసత్వం వహిస్తే తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాలను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



కందిన విద్యార్థి తొడ

జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసెయ్యాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 21: ఈ నెల 23 జరగనున్న గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్(అబ్జెక్టివ్ టైప్)పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ ఇంటర్నెట్ సెంటర్లు బంద్ చేయాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ కే. వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఏపీపీఎస్సీ సెక్రటరీ విజయవాడ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశాల మేరకు ఉదయం 9.00 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు జిల్లాలోని పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను యజమానులు మూసి వేయాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు

- ఏపీఈఆర్సీ చైర్మన్ ఠాకూర్ సింగ్



పద్మావతినగర్ ఇండోర్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న చైర్మన్

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవి కాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) చైర్మన్ ఠాకూర్ సింగ్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం నంద్యాలలోని విద్యుత్ సబ్‌స్టేషన్, పద్మావతి నగర్‌లోని ఇండోర్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. విద్యుత్ అధికారులకు పలు సూచనలు చేశారు. వీటిలో నంద్యాల బొమ్మలసత్రం 220/132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం 100 ఎంవీఏ నుంచి 160 ఎంవీఏకు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆళ్లగడ్డ నియోజవర్గంలోని ముత్యాలపాడు, శిరివెళ్లలో 220/132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. నంద్యాల డివిజన్ పరిధిలో అధికలోడు గల 33 కేవీ ఫీడర్ నుంచి తక్కువ లోడ్‌గల 33 కేవీ ఫీడర్‌కు డైవర్షన్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 33/11 కేవీ పద్మావతీనగర్ ఇండోర్ సబ్‌స్టేషన్‌కు 33 కేవీ ప్రత్యామ్నాయ సరఫరా కోసం ఎస్పీవై ఆగ్రో ఫీడర్ నుంచి సుమారు 6 కిలోమీటర్ల మేర లైన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఈలు మధుసూదన్‌రావు, బాబు రాజేంద్ర, నంద్యాల ఆపరేషన్స్ ఈఈ శ్రీనివాసులు రెడ్డి, ట్రాన్స్‌కో ఈఈ ప్రభాకర్, నంద్యాల టౌన్ డీఈఈ రమేష్‌కుమార్, ఏఈ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మనిషిని మింగిన మిషన్..

- పొట్టు మిషన్‌లో పడిపోయిన వ్యక్తి

నాన్నా..నాన్నా..ఎక్కడున్నావ్... అమ్మా..నాన్న మిషన్‌లో ఇరుక్కున్నాడే... మాట్లాడడం లేదు... అంటూ అన్నం తింటున్న తల్లి వద్దకు ఆ బిడ్డ పరుగులు తీశాడు. కొడుకు ఏడుపు చూసి ఆమె పరుగున వెళ్లి చూసింది. అప్పటికే ఆయన మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే...



మాల రాఘవేంద్ర(ఫైల్)

ఆదోని రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం కడితోట గ్రామానికి చెందిన మాల రాఘవేంద్ర(45), లక్ష్మి దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు, కొడుకు ఉన్నారు. గత 10సంవత్సరాలుగా ఆ దంపతులు ఆదోని - శిరుగుప్ప ప్రధాన రహదారిలోని మహాగౌరి ఉద్యోగ్ బయో మాస్ బ్రికెట్స్ ఫ్యాక్టరీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. శుక్రవారం కొడుకు వీరేష్‌తో కలిసి ఆ దంపతులు పనికొచ్చారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో అందరూ ఒకచోట కూర్చొని భోజనం చేశారు. ముందుగా భోజనం ముగించుకొన్న రాఘవేంద్ర ఫ్యాక్టరీలోకి వెళ్ళి మిషన్లు ప్రారంభించాడు. అందులోకి బుడ్డల పొట్టును వేస్తున్న క్రమంలో ఒక్కసారిగా మిషన్‌లోకి పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో రాఘవేంద్ర మృతి చెందాడు. రాఘవేంద్రతోపాటు లోపలి కెళ్లిన కొడుకు వీరేష్ మిషన్‌లో తండ్రి పడిపోయి తీవ్రంగా గాయపడి చనిపోవడం చూశాడు. కేకలు వేస్తూ, బయటకు పరుగులు తీశాడు. ఇంతలో భార్య లక్ష్మితోపాటు ఇతర కూలీలు లోపల కెళ్ళి చూశారు. రాఘవేంద్ర శవాన్ని పట్టుకొని ఆ ఇల్లాలు కన్నీటి పర్యంతమైంది. ఇస్వీ ఎస్.ఐ, నాగేంద్ర, ఫ్యాక్టరీ యజమాని మల్లికార్జున చేరుకొని శవాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఫ్యాక్టరీ యజమానుల నిర్లక్ష్యంతోనే..

ఫ్యాక్టరీ యజమానుల నిర్లక్ష్యంతోనే రాఘవేంద్ర చనిపోయాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ఫ్యాక్టరీలో కనీస జాగ్రత్తలు పాటించడం లేదని, గవిలాంటి ఈ భవనంలో పనిచేసే కార్మికుల ప్రాణాలను రక్షించడానికి ముందు జాగ్రత్తలు తీసుకోలేదని అన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. **మేనేజర్ - ఏడివిటి**

'అడవుల సంరక్షణ అందరి బాధ్యత'

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీ అధికారులు గ్రామాల్లో ప్రజలకు సూచించారు. మండలంలోని ఓంకారం, నియిని చెర్వు, శింగవరం, ఎరుకల కాలనీ, నారాయణపురం గ్రామాల్లో శనివారం కళాజాతా బృందం చేత ఎఫ్ఆర్వో నజీర్ఖా ఆధ్వర్యంలో ప్రదర్శనలు చేయించారు. అడవులకు నిప్పు, నరకివేత, అటవీ జంతువుల వేట వల్ల నష్టాలు, కష్టాలను వివరిస్తూ అవగహన కల్పించారు. అడవుల్లోకి అనుమతి లేకుండా వెళ్లకూడదని, ప్లాస్టిక్ వస్తువులు నిషేధమని తెలిపారు.

'సారాకు దూరంగా ఉండాలి'

నందికొట్కూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సారా వాడకం, తయారీకి దూరంగా ఉండాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ జగ్రుల్లా సూచించారు. పట్టణంలోని నీలి షికారి కాలనీలో శుక్రవారం 'నవోదయం 2.0'లో భాగంగా ర్యాలీ నిర్వహించిన అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్ఐ మాట్లాడుతూ సారా వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో నందికొట్కూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సిబ్బంది కుమారి, సంధ్యారాణి, శ్వేతా, రాణి, శంకర్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ గురురాజా' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి డ్రాయింగ్, గ్రామర్ పోటీల్లో గురురాజ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ పి.షేక్షావలిరెడ్డి తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చిత్ర దుర్గ పట్టణంలో చింతన ప్రకాశం ఫౌండేషన్ నిర్వహించిన డ్రాయింగ్ పోటీలో టి.చార్విక్, ఎస్.ఈశ్వరయ్య జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం, చరణ్‌తేజరెడ్డి, జెస్సికా రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారని చెప్పారు. ఇంగ్లీష్ గ్రామర్ పోటీల్లో లక్ష్మీశ్రీనివాస్, విష్ణు వర్ధన్ జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు, బద్రీశ్వర్, తనూష్ రాష్ట్ర స్థాయిలో ఫస్ట్‌ర్యాంక్ సాధించారని చెప్పారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను, కృషిచేసిన ఉపాధ్యాయులను డైరెక్టర్ అభినందించారు.

బ్రహ్మోత్సవాలకు కూరగాయల విరాళం



ప్రత్యేక వాహనంలో శ్రీకాళహస్తికి కూరగాయలను పంపిస్తున్న ప్రసాద్ దంపతులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాళహస్తీశ్వరుడి బ్రహ్మోత్సవాలకు నంద్యాల నుంచి 20 టన్నుల కూరగాయలను ప్రత్యేక వాహనాల ద్వారా పంపించారు. శుక్రవారం నంద్యాల పట్టణానికి చెందిన టి రామన్న అండ్ సన్స్ కూరగాయల హోల్‌సేల్ వ్యాపారి లక్కబోయున ప్రసాద్, ఆదిలక్ష్మి దంపతులు, కుమారుడు దిలీప్‌లు 20రకాల కూరగాయలను ప్రత్యేక వాహనాలలో శ్రీకాళహస్తికి పంపారు. ఈ సందర్భంగా కూరగాయల వ్యాపారి మాట్లాడుతూ ఈనెల 21 వతేది నుంచి మార్చి 6వతేదీ వరకు శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఈవో బాపిరెడ్డి ఆధ్వర్యంలో జరిగే శివరాత్రి ఉత్సవాలకు తరలి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్నదానం చేయడంలో తనవంతు సహాయంగా ఉచితంగా కూరగాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గత 17సంవత్సరాలుగా కాళహస్తి క్షేత్రానికి కూరగాయలు విరాళం ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. నంద్యాల జిల్లాలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, ఆలయాలలో జరిగే పర్వదినాలకు తనవంతు సేవగా కూరగాయలను ఉచితంగా అందిస్తున్నామన్నారు.

గూగుల్ మ్యాప్ తెచ్చిన తంటా

- నల్లమమలో దారితప్పిన శివస్వాములు
- ఎట్టకేలకు ట్రేస్ చేసిన అటవీ అధికారులు



నల్లమలలో దారి తప్పిన శివస్వాములతో అటవీ అధికారులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గూగుల్‌మ్యాప్ చేసిన తంటాతో శివస్వాములు నల్లమలలో దారి తప్పిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. అయితే ఎట్టకేలకు అటవీ అధికారుల చొరవతో సురక్షితంగా బయట పడ్డారు. వివరాలివీ.. తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూలు జిల్లా పెంటవల్లికి చెందిన సుమారు 30 మంది శివస్వాములు కాలినడకన శ్రీశైలానికి బయలు దేరారు. అయితే అందరూ వెళ్లే మార్గంలో కాకుండా గూగుల్ మ్యాప్‌ను నమ్ముకుని వారు కాలినడకన ప్రయాణం కొనసాగించారు. మండలంలోని వెంకటాపురం గ్రామం మీదుగా ప్రయాణం కొసాగించాల్సి ఉండగా కురుకుంద, శ్రీపతిరావు పేట గ్రామం మీదుగా నల్లమల అడవుల్లోకి ప్రవేశించారు. వారికి శ్రీశైలంలోని శిఖరం గూగుల్ మ్యాప్‌లో చూపడంతో మ్యాప్‌ను అనుసరించి కొండలో తిప్పలు ఎక్కుతూ ప్రయాణం సాగించారు. వీరిలో 23 మంది ఎలాగోలా బయట పడగా మరో ఏడుగురు అడవిలో దారి తప్పి నల్లమలలోని ఇందిరేశ్వరం వెస్ట్ బీట్‌లో ఉండి పోయారు. వెంట తెచ్చుకున్న ఆహారం, నీరు అయి పోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉండగా ఓ చోట వారికి సెల్‌ఫోన్ సిగ్నల్స్ వచ్చాయి. వెంటనే 100కు డయల్ చేయగా వారు స్థానిక ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. దీంతో డిప్యూటీ డిరెక్టర్ సాయి బాబాకు ఫోన్ చేసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వెంటనే అప్రమత్తమైన ఆయన ఎఫ్ఎస్‌వో మక్బుల్ బాషా, ఎఫ్‌బీవో మద్దిలేటితో పాటు మరి కొందరిని వారిని గుర్తించేందుకు పంపించారు. ఎట్టకేలకు రాత్రి 9 గంటలసమయంలో శివస్వాముల ను గుర్తించి అతికష్టం మీద శివస్వాముల లోకేషన్‌ను గుర్తించి వారిని అటవీ శాఖ వాహనంలో అధికారులు ఆత్మకూరుకు చేర్చారు. దీంతో వారు అటవీ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

'హమాలీల సమస్యలు పరిష్కరించాలి'

నంద్యాల రూరల్ , ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): హమాలీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పౌరసరఫరా గోదాము వద్ద రెండో రోజు నిరసన చేపట్టారు. ఈనెల 28 వరకు నిరసన చేపడతామన్నారు. అప్పటికి సమస్యలు పరిష్కరించకపోతే మార్చి 7న విజయవాడలోని డీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



నంద్యాలలో తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ హైస్కూల్‌లో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. మనిషిని పరిపూర్ణ మానవుడిగా, ఉత్తమ పౌరుడుగా మార్చగలిగే శక్తి ఒక్క మాతృభాషకు మాత్రమే ఉందని, అలాంటి మాతృభాష మనుగడ కోసం నేడు ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని సాహితీ స్రవంతి నంద్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి అన్నారు. దంత వైద్యుడు డా.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ తెనెలొలుకు భాష మన తెలుగు భాష, ఇంత కమ్మనైన మన అమ్మభాషను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపైనా ఉందన్నారు. నేటి విద్యార్థులల్లో పుస్తక పఠనం లేకపోవడం వల్ల వారు మాతృభాషకు దూరమవుతున్నారు. పద్యపఠన పోటీలలో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రచయితలు డా. నీలం వెంకటేశ్వర్లు, సాహితీ స్రవంతి సభ్యులు రామచంద్రమూర్తి, నీలకంఠమాచారి, రఫి, ఉపాధ్యాయులు రహంతున్నీసా, భారతి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: మాతృభాష మధురం.. అభ్యసనే అందరి లక్ష్యం అని అల్ మదద్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమళ్ల రహీం అన్నారు. శుక్రవారం పట్టణం ముల్లాన్‌పేట మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పాణ్యం: మాతృభాషను పరిరక్షించుకోవాలని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'రైతులు నమోదు చేసుకోవాలి'

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి పొందాలన్నా ఇకపై విశిష్ట సంఖ్యే ప్రామణికమని, రైతులు ఈ సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని ఏవో స్వాతి సూచించారు. శనివారం మండలంలోని ఎ.కోడూరు రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ప్రతి రైతు ఆర్ఎస్‌కేలలో నమోదు చేసుకోవాలని సూచించారు.

కార్మిక సమస్యలపై 24న ధర్నా

మిడుతూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యలపై ఈనెల 24న నంద్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నామని, కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి కోరారు. మిడుతూరు ఎంపీడీవో కార్యాలయం సమీపంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

మద్యం స్వాధీనం

మిడుతూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండలంలోని జలకనూరు గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయం, ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో తెలుగు మాధవ స్వామి మద్యం విక్రయిస్తుండగా ప్రొహిబిషన్ ఎస్ఐ జగ్రుల్లా తన సిబ్బందితో దాడి చేసి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, కుమారి, కానిస్టేబుల్ శివన్న, శ్వేత రాణి, సంధ్యా రాణి ఉన్నారు.

సారా స్థావరాలపై దాడులు

సున్నిపెంట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సున్నిపెంట గ్రామంలోని సుగాలి తండ సమీపంలోని మోకాళ్ళ కురువ, మామిడిశెల అటవీ ప్రాంతంలోని సారా స్థావరాలపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. సుమారు 2000 వేల లీటర్ల సారా తయారు చేసే బెలం ఊటను ధ్వంసం చేశారు. సున్నిపెంట ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న రమావత్ బద్రునాయక్ సారా విక్రయిస్తుండగా 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు శ్రీశైలం ఎక్సైజ్ సీఐ ఎస్. కిషోర్ కుమార్ తెలిపారు. ఈ దాడులో ఫారెస్టు రేంజర్ సుభాష్‌రెడ్డి, ఎక్సంజ్ సిబ్బంది కృష్ణుడు, బాదుల్ల, సుధీర్, మధు తదితరులు ఉన్నారు.

'బీజేపీతోనే దేశాభివృద్ధి'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ ఆర్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు పాకా సత్యనారాయణ అన్నారు. నంద్యాల ఎస్‌బీఐ కాలనీలోని రామకృష్ణా పీజీ కళాశాలలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై ప్రముఖుల, మేధావులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాకా సత్యనారాయణ హాజరై ప్రసంగించారు. గతంలో బడ్జెట్ కంటే 50రెట్లు బడ్జెట్ పేదలకు ఉపయోగపడేలా ఈ బడ్జెట్ రూపొందించారన్నారు. అభిరుచి మధు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలను, యువత, ఉద్యోగులను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్ అని, ఇది అన్ని వర్గాల ప్రజలకు మేలు కలిగించిందన్నారు. మేడా మురళీధర్, డా.నారాయణ, సుధాకర్, వీజేకే మూర్తి, బీజేపీ కార్యకర్తలు ఉపేంద్రరెడ్డి, రమేష్‌బాబు, లక్ష్మీరెడ్డి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

'రైతు ప్రయోజనాల కోసమే నీటి కుంటలు'

గోస్పాడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనం సమకూర్చేందుకే నీటి కుంటలు ఏర్పాటు చేస్తున్నట్లు డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం డ్వామా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 497 గ్రామ పంచాయతీల్లో ఒక్కోక్క పంచాయతీకి కనీసం 10 నీటి కుంటలు నిర్మాణం చేపట్టేందుకు యంత్రాంగం పనిచేస్తుందన్నారు. ఈనెల28 తేదిలోపల రైతులను ఎంపిక చేసి మార్చి 1 నుంచి పనులు చేపడతామన్నారు. జిల్లాలో రోజువారి ఉపాది కూలీల సంఖ్య పెంచుతామన్నారు. రోజుకు లక్ష మంది ఉపాది పని చేయాలన్నారు.

విధుల బహిష్కరణ

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు న్యాయవాదుల సవరణ చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వేముల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, ఆత్మకూరు న్యాయవాదులు తమ కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. సీనియర్ న్యాయవాది గోవిందరెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదుల చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఈ చట్ట సవరణ బిల్లుతో కక్షి దారులు తమకు కావాల్సిన న్యాయ వాదులను నియమించుకునే హక్కు కోల్పోతారని అన్నారు. న్యాయవాదులు, ప్రజల హక్కులను హరించేలా రూపొందించిన 1961 న్యాయవాదుల చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. న్యాయవాదులు పుల్లారెడ్డి, గిరిరాజు,కేశవరెడ్డి, నగేష్, సిద్దిక్ అమ్మద్, లక్ష్మీనారాయణ, నరసింహులు, బతుకులయ్య,మహబూబ్ భాష, ఆసిఫ్ అలిఖాన్,చింతలయ్య, మాణిక్యరావు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సేవలో భూమా బ్రహ్మానందరెడ్డి



భోజనం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల పాదయాత్రికులకు మండలంలోని పలు ప్రాంతాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. కృష్ణాపురం గ్రామ శివార్లలో నంద్యాల మండలం బ్రాహ్మణ పల్లి సంజీవరాయ దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పాల్గొని శుక్రవారం భక్తులకు భోజనాన్ని వడ్డించారు. గత 14 సంవత్సరాలుగా ఈ అన్నదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు దాట్ల రాజశేఖరరెడ్డి తెలిపారు. నంద్యాల టీడీపీ మండల కన్వీనర్ గురున్నాథరెడ్డి, కో కన్వీనర్ మహేంద్ర కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు సురేంద్ర కుమార్‌రెడ్డి, హరి కాంత రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవీంద్రారెడ్డి, భోగేశ్వరరెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

'విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు'



విద్యార్థులకు ప్లేటు అందజేస్తున్న ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని ఎల్ఐసీ ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్, ఏబీఎం విశ్వనాథ్ అన్నారు. వెంకటాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు ఎల్ఐసీ సహకారంతో భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు విజయ్‌కుమార్, మనోజ్ కుమార్, లియాఫి ట్రెజరర్ రాంబాబు, ఇస్మాయిల్ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జవహర్ నాయక్, హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మహానందికి ఎమ్మెల్యే బుడ్డా

మహానంది, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి శనివారం మహానంది రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తహసీల్దార్ రమాదేవి శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. అనంతరం ఎంసీ ఫారంలోని ఉద్యానవన పరిశోధన స్థానంలో జరిగే రైతుసదస్సులో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

పాములపాడులో బహిరంగ సామాజిక తనిఖీ

పాములపాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24వ సంవత్సరంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, పంచాయతీరాజ్ పనులపై శుక్రవారం పాములపాడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బహిరంగ సామాజిక తనిఖీ చేపట్టారు. అధికారులు బాలాజీనాయక్, అన్వరాబేగం సమక్షంలో సోషల్ ఆడిట్ బృందం డీఆర్పీలు గ్రామాలలో నిర్వహించిన తనిఖీలలో సేకరించిన రిమార్కులను చదివి వినిపించారు. మండలంలో 14 గ్రామ పంచాయతీలలో 9,97,574 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో అవినీతిపై ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.86 వేలు రికవరీ చేశారు. పెనాల్టీ రూ.11 వేలు, రీ ప్లాంటేషన్ రూ.7,64,194లుగా అధికారులు తేల్చారు. రుద్రవరం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామస్థులు పలు ఆరోపణలు చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గ్రామంలోని రెండు వర్గాల మధ్య మాటాల యుద్ధం జరిగింది. పరిస్థితి శృతి మించడంతో పోలీసులు చేరుకొని సద్దుమనిగించారు. ఫిర్యాదుపై పరిశీలించి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకొంటామని అధికారులు గ్రామస్థులకు హామి ఇచ్చారు. విజిలెన్స్ శివరాణి, క్వాలిటీ కంట్రోలర్ గంగాధర్, ఎంపీడీవో చంద్రశేఖర్, జేఈ రాఘవేంద్రప్రసాద్, ఏపీవో విమలమ్మ, ఎస్ఆర్‌పీ మరూద్, సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

'బ్లాక్‌లో విక్రయించినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా'

పాణ్యం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): యూరియా బ్లాకులో అమ్ముకున్నట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని ఏవో జయప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులతో అవసరమైనంత వరకు పని చేయించుకున్న నాయకులు అదే ఉద్యోగులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఆలమూరుకు రైతుల అవసరాన్ని బట్టి అక్కడి టీడీపీ నాయకుడు రామగోవిందరెడ్డి వినతి మేరకు దాదాపు మూడు వేల బస్తాల యూరియా పంపించామన్నారు. పంపించిన యూరియా ఎంత మంది రైతులకు పంచారో అందరికీ తెలుసు అని అన్నారు. యూరియా కొరతను దృష్టిలో ఉంచుకొని రైతులకు సర్దుబాటు చేస్తున్నామన్నారు. ఆలమూరుకు ఇంకా ఇవ్వలేదన్న కారణంతో బ్లాకులో అమ్ముకున్నట్లు ఆరోపణలు చేయడంపై నాయకులు ఆలోచించుకోవాలన్నారు. కలెక్టరుకు వివరిస్తామన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు: డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసుకుంటున్న స్కాన్ సెంటర్లు తప్పనిసరిగా జిల్లా కమిటీవద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ప్రతి ఐదేళ్లకోసారి రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. లింగనిర్ధారణ నిషేధ చట్టంపై జిల్లాలో ఐసీడీఎస్, మహిళా సంఘాలు, పోలీసుల సహకారంతో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సబ్ డిస్ట్రిక్ట్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ చైర్మన్, ఆర్డీవో విశ్వనాథ్ మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చేసేవారు, చేయాలని ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా లీగల్ అధికారి సుమలత, వైద్యులు పద్మజ, అరుణజ్యోతి, ఎన్‌జీవోలు రామారావు, పాల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో దేవదాయశాఖ ఉప కమిషనర్ పూజలు



ఉప కమిషనర్‌కు తీర్థప్రసాదం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

పాణ్యం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు దేవస్థానంలో శుక్రవారం దేవదాయశాఖ ఉప కమిషనర్ గురుప్రసాద్ పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు సుబ్బకృష్ణయ్య, నాగేశ్వరయ్య, సూర్యనారాయణ ఉన్నారు.

రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి: ఏపీసీ



కేజీబీవీలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, ఇన్‌చార్జి డీఈవో ప్రేమంత్ కుమార్ సూచించారు. బండిఆత్మకూరు కేజీబీవీలో శనివారం ప్రత్యేకాధికారి దాక్షాయిణి ఆధ్వర్యంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలకు మంజూరైన నిధులు, వాటి ఖర్చులు, వివిధ రిజిస్టర్లను సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్లు రఘురామిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, రామ్మోహన్, లలితమ్మ, సువర్చల, శ్రీనివాసులు వేర్వేరుగా పరిశీలించారు. అనంతరం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో వారు చర్చించారు.

'శిల్పా ఆరోపణల్లో నిజం లేదు'



జేసీతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం కానాల గ్రామ ప్రజల ఇంటిపట్టాలు టీడీపీ నాయకులు దౌర్జన్యంతో ఆక్రమిస్తున్నారని వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి చేసిన ఆరోపణల్లో నిజయం లేదని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జేసీ విష్ణుచరణ్ గ్రామ టీడీపీ నాయకులు, ఇంటి పట్టాల ప్రజలు కలిసి వినతిపత్రం అందజేశారు. జరిగిన వాస్తవాలను జేసీకి వివరించారు. అనంతరం మీడియాతో టీడీపీ నాయకుడు బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటిపట్టాల విషయంలో అవకతవకలు జరిగాయని వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు కట్టుకథలు అని అన్నారు. పేదల ఇంటి పట్టాలను టీడీపీ నాయకులు ఎందుకు లాక్కుంటారని ప్రశ్నించారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఎన్ఎండీ ఫరూక్ కానాల గ్రామంలో ఉన్న పేద ప్రజలకు ఇంటి పట్టాలు మంజూరు చేశారని, 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ఇంటి పట్టాలను ఏకపక్షంగా రద్దుచేసి శిల్పానగర్ అనే పేరుపెట్టి వారికి ఇష్టం ఉన్నవారికి పట్టాలను పంపిణీ చేయడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కూటమి నాయకులపై బురదజల్లే పని మానుకోవాలని హితవు పలికారు. గ్రామంలోని లబ్ధిదారులకు టీడీపీ నాయకులు అండగా ఉంటారని, గ్రామానికి సంబంధించిన ప్రజలకు కాకుండా ఇతరులకు ఇంటిపట్టాలు ఇచ్చింది మీరు కాదా? అని ప్రశ్నించారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు: ఈవో



మహానందిలో క్యూలైన్లను పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహానంది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ రెండో ప్రాకారంలో బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల ఏర్పాట్లలో భాగంగా ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సాధారణ భక్తులు కూడ నిజరూ దర్శనం చేసుకోవడానికి ఉచిత దర్శనం ఏర్పాటు చేశామని, దీని కోసం ఈ ఏడాది ప్రత్యేక క్యూలైన్ ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈవో వెంట ఆలయ అర్చకుడు కొమ్మద్ది సుబ్బయ్యశర్మ ఉన్నారు.

శివాలయంలో పాము కలకలం



శివాలయ ఆవరణలో పాము

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని శ్రీరామ థియేటర్ సమీపంలోని శివాలయంలో నాగజాతికి చెందిన రక్తపింజరి పాము కలకలం రేపింది. ఆలయ ఆవరణలో పామును చూసి భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే నిర్వాహకులు స్నేక్‌స్నాచర్‌ను పిలిపించి బంధించారు. ఆ పామును నల్లమల అడవిలో వదిలి వేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

'సర్వే త్వరగా పూర్తి చేయాలి'

కొత్తపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న పీ-4 సర్వేను సచివాలయ సిబ్బంది వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో మేరీ సూచించారు. శుక్రవారం నందికుంట, భావాపురం, దుద్యాల, కొత్తపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న పీ-4 సర్వేను తనిఖీ చేశారు ఆమె మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో భాగంగా ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన


మాట్లాడుతున్న సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి

శిరివెళ్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి వ్యతిరేక అవగాహన వారోత్సవాల్లో భాగంగా శిరివెళ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తులకు సోకే క్షయ అత్యంత ప్రమాదకరమైందన్నారు. క్షయ వ్యాధి అంటువ్యాధి కావడంతో రోగగ్రస్తుడు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు గాలి ద్వారా ఆరోగ్యవంతులకు వ్యాపిస్తుందని వివరించారు. క్షయ వ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తే సరైన చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, టీబీ సూపర్‌వైజర్ శివ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి: ఆర్డీవో


జీనేపల్లెలో రీసర్వే వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో విశ్వనాథ్

శిరివెళ్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భూ రీసర్వే పనులు పకడ్బందీగా నిర్వహించాలని నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ అధికారులకు సూచించారు. మండలంలోని జీనేపల్లె గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. రీసర్వే పురోగతిని తహసీల్దార్ పుష్ప కుమారి, మండల సర్వేయర్ చిన్న మల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని 1,665 ఎకరాల భూమిని ఏడు బ్లాక్‌లుగా విభజించామని ఇప్పటి వరకు రెండు బ్లాకుల్లో 500 ఎకరాల భూముల రీసర్వే పూర్తయిందని వారు ఆర్డీవోకు తెలిపారు. రైతుల సమక్షంలోనే రీసర్వే చేపట్టాలని ఆర్డీవో సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ప్రసాద్, హసీనా, పలువురు సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు లేని విద్యార్థులకు చేయూత


విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ గంగన్న

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై తల్లిదండ్రులు లేని విద్యార్థులకు డిగ్రీ మూడు సంవత్సరాలపాటు ఫీజులు చెల్లించడంతో పాటు ఆర్థిక చేయూత అందిస్తానని ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గంగన్న తెలిపారు. పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన వీడ్కోలు సమావేశానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చక్కగా చదివి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం 125 మంది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సొంత నిధులతో ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు మల్లేశ్వరరెడ్డి, విజయలక్ష్మి, రాజు, నాగ మస్తాన్, కాశీ విశ్వనాథ్, స్వరూప పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు కమిషనర్ కిషోర్ తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పందులను పట్టించి తరలించామన్నారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, శానిటరీ సిబ్బంది పట్టణంలో పర్యటించి 80 పందులను పట్టించి ఇతర ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

ప్యాపిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణ అందరి బాధ్యతగా భావించాలని అటవీశాఖ అధికారి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఏనుగమర్రి గ్రామంలో కళాజాత ద్వారా అడవుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారి మాట్లాడుతూ అడవుల ద్వారానే మానవాళి మనుగడ సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో అందరు కలసి కట్టుగా ఉండి అడవులను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు మోపూరి రామక్రిష్ణ, అరిగెల శంకర్, సూర్యనారాయణగౌడు, మోపూరి రాము, నాగరాజు, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన ఉండాలి

రుద్రవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని అగ్రికల్చర్ ట్రైనరు లీల అన్నారు. శుక్రవారం కస్తూర్బాగాంధీ విద్యార్థినులు 124మందితో ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పెద్దకంబలూరు మెట్ట వద్ద ఉన్న ఆయిల్‌ఫాం నర్సరీలో మొక్కలపై అవగాహన కల్పించారు. వ్యవసాయం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక లాభాలు


రైతులతో మాట్లాడుతున్న షేక్ మీరా

బనగానపల్లె, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పకృతి వ్యవసాయం ద్వారా లాభాలు పొందవచ్చునని అనుప్రయోగ సంస్థ హైదరాబాద్ జోన్ డైరక్టర్ షేక్ మీరా శుక్రవారం అన్నారు. కెవికె సాంకేతిక సహకారంతో బలపనూరు గ్రామంలో మహిళా రైతు ఏర్పాటు చేసిన రెండంచెల విధానంలో పొట్టేళ్ల పెంపకం, కింద కోళ్ల పెంపకం యూనిట్లను ఆయన పరిశీలించారు. చిన్న, సన్నకారు రైతులు ఈ విధానాన్ని పాటించి వ్యవసాయాన్ని వ్యాపారాత్మకంగా మలచుకోవాలని కోరారు. యాగంటిపల్లె గ్రామంలో సమగ్రపంట యాజమాన్యంలో సాగు చేసిన మామిడి పొలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కెవికె సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి, కెవికె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శిగా పుల్లయ్య

డోన్ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ డోన్ పట్టణ నూతన సహాయ కార్యదర్శిగా పుల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, మండల కార్యదర్శి నారాయణ, పట్టణ కార్యదర్శి మోటరాముడులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కౌన్సిల్ సమావేశంలో కలచట్ల చంద్రశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

పడిపోయిన మిర్చి ధర

- భారీగా తగ్గిన దిగుబడి
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు


గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

సంజామల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గత మూడేళ్ల నుంచి మిర్చి రైతు నష్టపోతునే ఉన్నారు. అధిక వర్షాల వల్ల పంటకు తెగుళ్ల సోకడంతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గింది. దీంతో పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు మాత్రం తడిసిమోపడవుతోంది. ఎకరాకు రూ. లక్ష పెట్టుబడి పెట్టినా కూలీలు, రవాణా ఖర్చులకు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా 100 హెక్టార్లలో రైతులు సూపర్ 10, 6,7, బ్యాడ్జీ వంటి రకాలతో మిరప పంటను సాగు చేశారు. పంట సాగు నుంచి వివిధ తెగుళ్ల బారిన పడి పంట ఎదుగుబొందుగు లేకుండా పోయింది. ప్రధానంగా పంటకు బీ తెగులు వైరస్ సోకి ఎదుగుదల ఆగిపోయి పంట దిగుబడి భారీగా తగ్గిందన్నారు. గతంలో ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా 15 క్వింటాళ్ల వచ్చిందని రైతులు వాపోతున్నారు. క్వింటా ధర రూ.10,000 కూడా పలకకపోవడంతో గోదాములలో భద్ర పరుచుకొని ధర కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

తీవ్రంగా నష్టపోయాను..



ఈ ఏడాది వచ్చిన నష్టాన్ని ఎన్నడూ చూడలేదు. కనీస పెట్టుబడులు అయినా దక్కేవి. 6 ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. పెట్టుబడి రూ. 6లక్షలు పెట్టాను. దిగుబడి భారీగా తగ్గడంతో పాటు మార్కెట్‌లో ధర కూడా లేకపోవడంతో కూలీల ఖర్చులు కూడా రావడం లేదు.

- ఉపేంద్ర రెడ్డి మిరప రైతు ఎగ్గోని

దిగుబడి భారీగా తగ్గింది



ఈ ఏడాది పంట దిగుబడి భారీగా తగ్గిపోయింది 3 ఎకరాల్లో మిరప పంటను సాగు చేశా. కోత కోసి గ్రేడింగ్ చేస్తున్న కొనడానికి వ్యాపారులు రావడం లేదు. వచ్చిన వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. ఎకరాకు 10క్వింటాలు మాత్రమే వచ్చింది.

- శివయ్య మిరప రైతు సంజామల

తాగునీటి సమస్య రానివ్వొద్దు: ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి

డోన్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు సర్పంచులు గ్రామాల్లో తాగునీటి కొరత సమస్యను సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఉన్నతాధికారులను ఆదేశించారు. వ్యవసాయాదికారి అబ్దుల్ షఫీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. డోన్ మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 16వేలకు పైగా రైతులు ఉండగా.. 5,800 మంది రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకున్నారని అన్నారు. ఈ నెల 28వ తేదీలోపు రైతులు విశిష్ట సంఖ్య నమోదును చేసుకోవాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు బద్దెల రాజ్ కుమార్, మండల విద్యాధికారి ప్రభాకర్, ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి, ఈవోఆర్డీ ఫకృద్దీన్ ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో, అధికారులు

బనగానపల్లె, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : యాగంటి క్షేత్రంలో 25 నుంచి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని డోన్ ఆర్డీవో నరసింహులు, దేవాదాయశాఖ డీసీ గురుప్రసాద్ ఆలయ ఈవో చంద్రుడు, సిబ్బందిని కోరారు. శుక్రవారం వారు క్యూలైన్లు, స్నానమాచరించే కోనేరు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు భక్తులకు తాగునీరు లేకుండా చర్యలు తీసుకోవాలని, వివిధ వాహనాల్లో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. భక్తులకు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లను తనిఖీ చేశారు. ఆర్టీసీ వారు భక్తులకు బనగానపల్లె నుంచి ప్రత్యేక బస్ సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు. వైద్యాధికారులు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సానుభూతిపరుడికి పరామర్శ


నూర్‌బాషా ఆరోగ్య సమస్యను తెలుసుకుంటున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె పట్టణంలోని ఖాజీవాడలో నివాసం ఉంటున్న టీడీపీ సానుభూతిపరుడు ప్రిన్స్‌టైలర్ నూర్‌బాషా అనారోగ్యంతో బాధపడుతుండగా శుక్రవారం బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పరామర్శించారు. ఇటీవల నూర్‌భాష అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామి మాలధారులకు అన్నదానం


అన్నదానం ప్రారంభిస్తున్న అధ్యక్షుడు గుత్తి నరసింహులు

చాగలమర్రి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో అహోబిల లక్ష్మీ నరసింహస్వామి దీక్ష చేపట్టిన మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుత్తి నరసింహులు శుక్రవారం ప్రారంభించారు. 40 రోజుల నుంచి దీక్ష చేపట్టిన నరసింహస్వామి మాలదారులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. 23న ఇరుముడితో పాదయాత్ర ద్వారా అహోబిల క్షేత్రానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని దీక్ష ముగింపు చేస్తారని గురుస్వామి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ పద్ధతులు పాటించండి


మాట్లాడుతున్న ఉత్పత్తుల ధృవీకరణ రాష్ట్ర అధికారి మూల ప్రతాప్‌రెడ్డి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించాలని సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణ రాష్ట్ర అధికారి మూల ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ తదితర మండలాల్లో ఉఎన్‌డి-జీఏపీ పద్ధతిలో రైతులు సాగు చేసిన పప్పు శనగ పంటలను ఆయన పరిశీలించారు. సేంద్రియ పద్ధతిలో పండించిన శనగకు మార్కెట్ ధరకన్నా 20శాతం అధిక ధర లభిస్తుందని అన్నారు. ఈసందర్భంగా పప్పు శనగ పంటలో పోలం బడి కార్యక్రమాన్ని నిర్వహించి, సేంద్రీయ ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయా మండలాల వ్యవసాయ అధికారులు బి.జ్యోతి, సుధాకరరెడ్డి, నిరంజన్, ప్రమీల, అబ్దుల్‌హాక్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: సేంద్రియ పద్ధతిలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులను 20 శాతం అధిక ధరలకు విక్రయించుకోవచ్చని ఉత్పత్తుల ధ్రువీకరణ రాష్ట్ర అధికారి మూలప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల డివిజను పరిధిలో ఐఎన్‌డీ - జీఏపీ పద్ధతిలో పది మంది రైతులు సాగు చేసిన శనగ పంటను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల డివిజను మండల వ్యవసాయాధికారులు డి.నిరంజన్, జ్యోతి, ప్రమీల సుధాకర్‌రెడ్డి, అబ్దుల్‌హాక్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

సంజామల/డోన్ రూరల్/బేతంచెర్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీపై రుణాలు అందజేస్తుంది. దీంతో లబ్ధిదారులు రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయాల్లో లబ్ధిదారులకు బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. యూనిట్లకు ఎంపికైన వారి జాబితాను ఉన్నతాధికారులకు పంపుతామని ఎంపీడీవోలు తెలిపారు.


సంజామల: మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్ తరుణ్ కుమార్


బేతంచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్


డోన్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు

పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

- రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి


ప్రజా వేదికలో ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ రామిరెడ్డి

డోన్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ ఫలాలు అందించడానికి రాష్ట్రప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతుందని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం విజయవాడలోని కేంద్ర టీడీపీ పార్టీ కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో పాటు ధర్మవరం సుబ్బారెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డోన్ మండలం యాపదిన్నె గ్రామానికి చెందిన సర్పంచ్ రామిరెడ్డి తమ గ్రామంలో గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండానే వాటర్‌షెడ్డు పనులు చేపట్టారని, ప్రజా వేదికలో ఫిర్యాదు చేశారు.

పాడి పరిశ్రమాభివృద్ధే గోకుల్ మిషన్ లక్ష్యం


పాల సేకరణ డబ్బాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

చాగలమర్రి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమ ద్వారా రైతులకు ఆర్థిక చేయూత ఇవ్వాలన్నదే రాష్ట్రీయ గోకుల్ మిషన్ లక్ష్యం అని ఉమ్మడి కర్నూలు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తోడేండ్లపల్లెలోని గ్రామంలో ఆళ్లగడ్డ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య, చాగలమర్రి ఏడీ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా 40 లేగదూడలకు నట్టల నివారణ మందులు తాపించి వాటి పెంపకంపై పాడిరైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. అలాగే క్యాల్షియం టానిక్‌లు, మినరల్ మిక్చర్ బ్లాకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందయ్య, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఏడీ మల్లన్న, పశు వైద్యులు సాయిబాబా, దీపాకుమారి, రైతులు పాల్గొన్నారు.

పార్వేట ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.నాగులవరం గ్రామంలో పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలాలక్ష్మీనరసింహస్వామి ప్రహ్లాదవరదస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారికి నైవేద్యం సమర్పించి పూజలు ప్రారంభించారు భక్తులు నమో నారసింహ అంటూ ఉత్సవ పల్లకీలో కొలువుదీరిన వారికి ప్రత్యేక పూజలు చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

డోన్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం వార్డు టీడీపీ నాయకులు మంగమూరి అశోక్ నాయనమ్మ అయిన తిమ్మమ్మ మృతికి టీడీపీ యువ నాయకులు మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి సంతాపం తెలిపారు. వారి నివాసానికి వెళ్లి ఆమె భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌతమ్ కుమార్ రెడ్డి వెంట చిన్నకాంతు, వీరాంజి తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

చాగలమర్రి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. చాగలమర్రి మండలం మద్దూరు గ్రామానికి చెందిన మాదం లక్ష్మీదేవికి ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారురాలి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడుకు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు భరతమాత వేషధారణతో ప్రదర్శన ఇచ్చారు. ఎంఈవోలు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ మాతృభాష తీయని భాషలాంటిదని, భాషను మరువరాదని సూచించారు. మాతృభాష సంస్కృతి, సంప్రదాయలకు ప్రతిబింబమన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.


కొలిమిగుండ్లలో మాట్లాడుతున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి


గోర్లగుట్టలో తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు


చాగలమర్రి: గొడిగనూరు పాఠశాలలో వివిధ వేషధారణలో విద్యార్థినులు



బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామంలో...


రుద్రవరం ఆదర్శ పాఠశాలలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు